ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

హామీలన్నీ నెరవేర్చారు.. చరిత్ర సృష్టించారు

● వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ● రామచంద్రాపురం నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమ్మేళనం ● హాజరైన రామచంద్రాపురం అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక



ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు



ఎమ్మెల్యే అభ్యర్థి సూర్య ప్రకాశ్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌రావును సన్మానిస్తున్న అభిమానులు

నిజాంపేట్: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నిజాంపేట్ సప్తపది ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న రామచంద్రాపురం నియోజకవర్గ ప్రజల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి రామచంద్రాపురం ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

సంక్షేమ పథకాలకు రూ.2.61లక్షల కోట్లు వెచ్చించాం..

◆ ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు రూ.2.61లక్షల కోట్ల నిధులను వెచ్చించారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఇచ్చిన 642 హామీల్లో కేవలం 40 మాత్రమే అమలు చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు మళ్లీ ప్రజలను ఎలాగైనా మోసం చేయాలని చూస్తున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన జననేత జగన్‌మోహన్‌రెడ్డి..

◆ దేశంలో ఏ ప్రధానమంత్రి, ఏ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయలేదని కేవలం ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే హామీలన్నీ అమలు చేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి పేద కుటుంబం బాగుండలంటే.. ప్రతి విద్యార్థి చదువుకోవాలంటే.. ప్రతి రైతు సంతోషంగా ఉండాలంటే.. ప్రతి యువకుడు బాగుపడాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అన్ని సామాజిక వర్గాల్లోని నేతలకు సరైన అవకాశాలు కల్పిస్తూ పంచాయతీ నుంచి ఉభయసభలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పిస్తున్నారని తెలిపారు. అందుకు తానే ఓ ఉదాహరణ అని పేర్కొన్నారు.

అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌రావు మాట్లాడుతూ... రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అవకాశాలు, సంక్షేమ పథకాలు సక్రమంగా జరగాలంటే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించాలని పిలుపునిచ్చారు. పేద వర్గాలకు న్యాయం చేసే నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలకు అనునిత్యం పనిచేసే తనను అదే విధంగా రామచంద్రాపురం ఎమ్మెల్యే అభ్యర్థి సూర్య ప్రకాశ్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల్లో చంద్రబాబు ఎన్ని జిమ్మికులు చేసినా ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బలపరిచేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

పేదలకు న్యాయం చేసే నేత జగన్‌మోహన్‌రెడ్డి
రాపాక వరప్రసాద్‌రావు

జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంను చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. అన్నివర్గాల ప్రజల భవిష్యత్‌ను తీర్చిదిద్దే వైఎస్సార్‌సీపీకే అందరూ ఓటు వేయాలని కోరారు. మరో 45 రోజుల్లో ఎన్నికలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి సీఎంగా చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజల్లో లభిస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు జతకట్టి కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. రామచంద్రాపురం నియోజకవర్గ ప్రజలు ఎక్కడ ఉన్నా అందరికీ తానెప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు 125 సార్లు బటన్ నొక్కి ప్రారంభించి అమలు చేశారు. అలాంటి నాయకుడి కోసం ప్రజలంతా ఈసారి ఒకటి ఎమ్మెల్యే అభ్యర్థికి, రెండోది ఎంపీ అభ్యర్థికి బటన్ నొక్కి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు చింతలపాటి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ సప్తపది ఫంక్షన్‌హాల్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కోలాహలం

ఈటల విజయానికి సైనికుడిలా పనిచేయాలి



అసెంబ్లీ కార్యకర్తల సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, సాయి, తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ కార్యాలయంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయి ఆధ్వర్యంలో ఆదివారం అసెంబ్లీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ విచ్చేసి పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ జెండా ఆవిష్కరించారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించేందుకు యువమోర్చా కార్యాచరణ, భవిష్యత్ కార్యక్రమాల గురించి నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈటల విజయానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలి



వివేకానందనగర్ డివిజన్ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న అనితారెడ్డి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానందనగర్ పటేల్‌కుంట పార్కు సమీపంలో ఉన్న బీజేపీ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం డివిజన్ స్థాయి నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి వివేకానందనగర్, పాపిరెడ్డినగర్‌కు సంబంధించిన అన్ని బూత్‌స్థాయి అధ్యక్షులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి అనితారెడ్డి హాజరై ప్రసంగించారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. చేవెళ్ల లోకసభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మణిభూషణ్, అశోక్ నరేష్, శ్రీనివాస్, మామిడి సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అమావాస్య అన్నదాన వితరణ

మోతీనగర్: జై ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన వితరణ సోమవారం మధ్యాహ్నం 12గంటలకు గాయత్రినగర్, గాంధీ బొమ్మ వద్ద నిర్వహించనున్నట్లు జై ఆర్యవైశ్య సేవా సమితి నాయకులు తెలిపారు. ఈ అన్నదానం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

కూరగాయల సంత

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లోని బాలాజీ స్వర్ణపురికాలనీలో ప్రతి సోమవారం కూరగాయల సంత కొనసాగుతుంది. ఈ సంతలో తాజా కూరగాయలు, పండ్లు, పూలు, ఇతర నిత్యావసర వస్తువుల, గృహోపకరణాలు అందుబాటులో ఉంటాయి.

నాలా విస్తరణ పనులు వేగవంతం చేయాలి

మోతీనగర్: వి.రామారావునగర్ నుంచి అవంతి నగర్ తోట వరకు చేపడుతున్న నాలా విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్సీ చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ మూసాపేట డివిజన్ల మధ్య నత్తనడకన కొనసాగుతున్న నాలా విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీ రమేష్, అధికారులు సత్యనారాయణ, ఆనంద్, శ్రీదేవి, రంజిత్ అనురాగ్, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు వినాయకరావు, బలరాం తదితరులు పాల్గొన్నారు.



రాగిడి లక్ష్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుందాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి కృష్ణారెడ్డి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని చంద్రగార్డెన్స్‌లో జరిగిన ఆదివారం నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కృష్ణారావు కార్యకర్తలకు మల్కాజ్‌గిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని పరిచయం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో బీఆర్‌ఎస్ ఎంపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వేల కోట్ల రూపాయలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టారని గుర్తు చేశారు. అత్యాధునిక టెక్నాలజీతో పోలీస్ కంట్రోల్ రూమ్, ఫ్లై ఓవర్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థతో పాటు సీసీ రోడ్లు, పార్కులు, ఇంటింటికి తాగు నీరు, మురుగునీటి వ్యవస్థను శుద్ధి చేయటానికి ఎస్‌టీపీ ప్లాంట్ల నిర్మాణం చేపట్టారన్నారు. చేసిన అభివృద్ధిని చూసి రాగిడి లక్ష్మారెడ్డికి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, మేడ్చల్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, జావీద్, సంపత్‌రెడ్డి, చాంద్, ఇస్మాయిల్, మొయిన్, నర్సింహ, రోణంకి జగన్నాథం, మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, సజ్మా తదితరులు పాల్గొన్నారు.



చంద్రాగార్డెన్స్‌లో జరిగిన వస్తృతస్థాయి సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

ప్రజా సమస్యలు పరిష్కరించండి



స్థానికులతో కార్పొరేటర్ నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని భవానీనగర్‌లో అధ్వానంగా మారిన రహదారులు, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని భవానీనగర్ వాసులు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ దృష్టికి తీసుకొచ్చారు. ఆదివారం కార్పొరేటర్‌తో సమావేశం ఏర్పాటు చేసి స్థానిక సమస్యలను ఆయనకు వివరించారు. రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. నిత్యం డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ అధికారులకు ఫోన్ చేసి సమస్యలను తక్షణమే పరిష్కారించాలని కోరారు. కాలనీ అధ్యక్షులు సాయిలు, సత్యనారాయణ, సతీష్‌యాదవ్, శ్రీరాములు, రమేష్‌యాదవ్, చందుయాదవ్, బుర్రి యాదగిరి తదితరులున్నారు.

లక్ష ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ విజయం ఖాయం

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్

బాలానగర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలో లక్ష ఓట్లకు పైగా మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో మహిళా కార్యకర్తలతో, బాలానగర్ డివిజన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ పదేళ్లలో తెలంగాణ ప్రజలకు చేసిన మోసాన్ని వివరించాలని కార్యకర్తలకు సూచించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడంతోనే ప్రతిపక్షానికే పరిమితం చేశారన్నారు. పనిచేసిన వారికి ఇందిరమ్మ కమిటీల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు.

◆ తుక్కుగూడ జనజాతర సభలో రాహుల్ గాంధీ ఆవిష్కరించిన కాంగ్రెస్ మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. ఎంపీ అభ్యర్థి పట్నం సునీత తనయుడు రినీష్ మాట్లాడుతూ... రాముడిని రాజకీయాల్లోకి, మతంలోకి లాగవద్దన్నారు. ప్రతి సంవత్సరం ప్రతి మహిళకు లక్ష రూపాయలు ఇస్తామన్నారు. చదువుకునే విద్యార్థినులకు 50 శాతం రిజర్వేషన్ కల్పించటం వంటి పథకాలు కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించటం గొప్ప విషయమన్నారు. భారీ మెజార్టీతో పట్నం సునీతను గెలిపించాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, పుష్పరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

బాలాజీనగర్ డివిజన్ కార్యకర్తలతో సమావేశం

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణ రాజ్‌పుత్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి కుమారుడు పట్నం రినీష్‌రెడ్డి హాజరయ్యారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సునీతామహేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు గాలి బాలాజీ, సాదు ప్రతాప్ రెడ్డి, శేరి సతీష్ రెడ్డి, గూడెపు నాగరాజు, డివిజన్ కమిటీ సభ్యులు, మహిళా నాయకురాళ్లు, కాంగ్రెస్ నాయకులు, ఎన్‌ఎస్‌యుఐ నాయకులు, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్, ఎంపీ అభ్యర్థి సునీత తనయుడు రినీష్ తదితరులు



బాలాజీనగర్ డివిజన్ కార్యకర్తల సమావేశంలో రినీష్‌రెడ్డి తదితరులు

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల లోకసభ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

ఆల్విన్‌కాలనీ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం చేవెళ్ల లోకసభ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌తో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఏప్రిల్ 13న చేవెళ్లలో జరిగే కేసీఆర్ భారీ బహిరంగ సభను సమష్టి కృషితో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ముక్తకంఠంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని ప్రకటించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓటు అడగాలన్నారు. ఈసారి కూడా పార్టీ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. పార్టీ రెండు సార్లు అవకాశం ఇచ్చిందని, ఇద్దరు నేతలు ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తున్నారని ఆ ఇద్దరిని ఓడించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటోందన్నారు. కేసీఆర్‌ను ప్రజలు ఇప్పుడు గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, బీఆర్‌ఎస్ డివిజన్ల అధ్యక్షులు సంజీవరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్, గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు

డాక్టర్ కృష్ణ చైతన్యరావు



5కే మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయటం వల్ల తమ ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని డాక్టర్ కృష్ణ చైతన్య రావు అన్నారు. ఆదివారం వరల్డ్ హెల్త్ డే సందర్భంగా కూకట్‌పల్లిలోని మై హెల్త్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 5కే మారథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాక్స్ హెల్త్ హాస్పిటల్ డైరెక్టర్ కృష్ణచైతన్యరావు మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో ప్రతి మనిషి ఆరోగ్యపరంగా గుండె సమస్యలు కిడ్నీ సమస్యలు, మహిళలకు గైనకాలజీ సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. వాటిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామాలు చేయాలన్నారు. 5కె రన్‌లో గెలిచిన డాక్టర్ కిరణ్, శ్రీనివాసులకు మెడల్ అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహారెడ్డి, డాక్టర్ జయంత్‌రెడ్డి, డాక్టర్ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, అన్వేష్ చౌదరి, భాస్కరరావు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రంజాన్ కానుక

మోతీనగర్: నియమ నిష్టలతోచేసే ఉపవాస దీక్షలతో ఎంతో పుణ్యం లభిస్తుందని నీలిమ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ పి. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం నీలిమ ఆసుపత్రి ఆధ్వర్యంలో అల్లాపూర్‌లో మహిళలకు రంజాన్ పండుగ సందర్భంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే నీలిమన్ నైస్ పేరిట ప్రతి నెలా ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీలిమ, వైద్యులు సాజిత్, శ్రీతేజ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలను పరిష్కరిస్తా

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్, కృష్ణవేణినగర్, సాయి ప్రశాంత్‌నగర్ ఫేజ్–2లో నెలకొన్న పలు సమస్యలను కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఆదివారం స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా సమస్యలే పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. కాలనీల్లోని సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. త్వరలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

కిందికుంట పార్కు పరిశీలన...

నిజాంపేట్ హైటెన్షన్ లైన్ రోడ్డులోని కిందికుంట పార్కును వాకర్స్‌తో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. పార్కులో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని వాకర్స్ కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. పార్కు గోడలపై ఆహ్లాదకరమైన చిత్రాలను వేయించి, పార్కు చుట్టు పక్కల మొక్కలు, ఫుట్‌పాత్‌లపై బెంచీలను ఏర్పాటు చేస్తానన్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్‌లపై చర్యలు తీసుకోవాలి

పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు చంద్రారెడ్డి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీలో అక్రమంగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి నీటిని విక్రయిస్తూ భూగర్భ జలాలను ఎండగడుతున్న వాటర్ ప్లాంట్ నిర్వాహకులపై బస్తీవాసులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బస్తీ అధ్యక్షుడు చంద్రారెడ్డి సమక్షంలో వీరాంజనేయ శివాలయం సమీపంలో నిరసన కార్యక్రమానికి బస్తీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి అక్రమ వాటర్ ప్లాంట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. వాటర్‌ప్లాంట్లను వెంటనే తొలగించి భావితరాలకు ఉపయోగపడే నీటిని కాపాడాల్సిన బాధ్యతను అధికారులు సక్రమంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. నిత్యం అక్రమ వాటర్ ప్లాంట్ల ద్వారా లక్షల లీటర్ల నీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ప్లాంట్ దళారులపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగవంతురెడ్డి, నరసింహులు ముదిరాజ్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో వర్క్‌షాప్

బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ క్వెస్ట్– 2024లో భాగంగా విద్యార్థులను డిమాండ్‌కు తగ్గ సాంకేతిక నైపుణ్యాలతో సన్నద్ధం చేసే లక్ష్యంతో వర్క్‌షాపులను నిర్వహించారు. ఈ వర్క్‌షాపు సీఎస్‌ఈ విభాగాధిపతి డా. కే.పి. సుప్రీతి మార్గదర్శకత్వంలో నడుస్తాయి. ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లు డాక్టర్ ఎం.ఆరతి, డాక్టర్ కె. నీరజ ఈ వర్క్‌షాపుల నిర్వహణకు నాయకత్వం వహించారు. విద్యార్థులకు రెండు కీలకమైన అంశాల్లో పరిశోధన చేయటానికి అవకాశం కల్పించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

మూసాపేట: మూసాపేటకు చెందిన మోసిన్ ఖాన్‌ను కూకట్‌పల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఎన్నికల పరిశీలకుడిగా తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి ఫర్హాన ఆజ్మీ ఆదివారం నియమించారు. ఈ సందర్భంగా మోసిన్‌ఖాన్ మాట్లాడుతూ.. పార్టీ పదవితో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించడానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, చైర్మన్ మైనార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి పర్హాన ఆజ్మి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇఫ్తార్ విందు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఎస్‌కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో రంజాన్‌మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్‌ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, మైనార్టీ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, తదితరులు